క్లుప్తంగా

ప్రశాంతంగా 10వ తరగతి పరీక్షలు

మాచర్ల: పట్టణంలోని 10వ తరగతి పరీక్షలు ప్రశాంతంగా కొనసాగుతున్నాయి. పట్టణంలోని పరీక్ష కేంద్రాలలో 1410 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరవుతున్నారు. మంగళవారం నిర్వహించిన న్యాచురల్ సైన్స్ పరీక్ష పట్టణంలోని కిడ్స్ పాఠశాల 2, జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాల 1, బాలురోన్నత పాఠశాల 1, సెయింటాన్స్ ఇంగ్లీషు మీడియం 1 పరీక్ష కేంద్రాలలో పరీక్షలు రాశారు. సెయింటాన్స్ తెలుగు మీడియంలో ప్రైవేటు, సప్లిమెంటరీ విద్యార్థులు పరీక్షకు హాజరయ్యారు. చీఫ్స్, ఇన్విజిలేటర్ల ఆధ్వర్యంలో ఎటువంటి ఇబ్బంది లేకుండా ప్రశాంతంగా పరీక్షలు జరుగుతున్నాయి.

731 మంది విద్యార్థులు పరీక్షకు హాజరు

రెంటచింతల: 10వ తరగతి పరీక్షలలో భాగంగా మంగళవారం నిర్వహించిన జీవశాస్త్రం పరీక్షకు 731 మంది విద్యార్థులు హాజరైనట్లు ఎంఈవో–2 వై.శివనాగేశ్వరరావు అన్నారు. సెయింట్ జోసఫ్ ఉన్నత పాఠశాల, వైఆర్ఎస్ ఉన్నత పాఠశాల, సెయింట్ ఆన్స్ ఇంగ్లీష్ మీడియం స్కూల్, ఫాతిమా విద్యానికేతన్ పాఠశాలల్లో మొత్తం 740 మంది విద్యార్థులకు గాను 731 మంది హాజరు కావడం జరిగిందన్నారు. పరీక్ష సెంటర్ల వద్ద 144 సెక్షన్ అమలు చేస్తున్నట్లు తెలిపారు.

బయోలాజికల్ సైన్స్ పరీక్షకు స్క్వాడ్



పిడుగురాళ్ల: పిడుగురాళ్ల పట్టణంలోని పదో తరగతి పరీక్ష కేంద్రాల్లో మంగళవారం స్క్వాడ్ హాజరయ్యారు. విద్యార్థులు పరీక్షలు ప్రశాంతంగా రాస్తుండటంతో స్క్వాడ్ సిబ్బంది సంతృప్తి వ్యక్తం చేసినట్లు ఎంఈవో ఏ శ్రీనివాసరెడ్డి తెలిపారు. శ్రీ చైతన్య, నారాయణ స్కూల్లో స్క్వాడ్ హాజరయ్యారు. స్క్వాడ్ సిబ్బందిగా వినుకొండ ఎంఈవో సయ్యద్ జపురుల్లా, వినుకొండ డిప్యూటీ తహసీల్దార్ అబ్బూరి వెంకటేశ్వర్లు హాజరైనట్లు తెలిపారు. అలాగే పిడుగురాళ్ల పట్టణం, మండలంలోని పదో తరగతి పరీక్షలకు 52 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు ఎంఈవో తెలిపారు. 10వ తరగతి పరీక్షలకు మొత్తం 11 పరీక్ష కేంద్రాల్లో 2,097 మంది విద్యార్థులకు గాను 2,045 మంది విద్యార్థులు హాజరయ్యారు. పరీక్ష కేంద్రాల్లో పరీక్షలు ప్రశాంతంగా జరిగాయని ఆయన పేర్కొన్నారు.

ఏపీ మోడల్ స్కూల్ ఇన్‌చార్జి ప్రిన్సిపాల్‌గా శ్రీనివాసులు



రెంటచింతల: మండలంలోని జెట్టిపాలెం గ్రామ శివారులోని ఏపీ మోడల్ స్కూల్ ఇన్‌చార్జి ప్రిన్సిపాల్‌గా సీనియర్ అధ్యాపకులు ఎం.శ్రీనివాసులును నియమించినట్లు ప్రిన్సిపాల్ కె.పాపయ్య మంగళవారం తెలిపారు. 2024 మే 13న జరగనున్న సార్వత్రిక ఎన్నికలలో భాగంగా ప్రభుత్వం తనను నియమ నిబంధనల పర్యవేక్షణ (ఫ్లయింగ్ స్క్వాడ్) అధికారిగా నియమించడం జరిగిందన్నారు. ఎన్నికల ప్రక్రియ ముగిసే వరకు ఎన్నికల నిర్వహణ బాధ్యతలు నిర్వహించాల్సి ఉన్నందున్న స్కూల్ పర్యవేక్షణ నిమిత్తం ప్రస్తుతం తెలుగు అధ్యాపకులుగా పని చేస్తున్న ఎం.శ్రీనివాసులును ఇన్‌చార్జి ప్రిన్సిపాల్‌గా నియమించినట్లు పాపయ్య తెలిపారు.

ఎన్నికల నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు



దాచేపల్లి : ఎన్నికల నియమ నిబంధనలు ఉల్లంఘిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ జీ సంధ్యారాణి అన్నారు. సాధారణ ఎన్నికల నేపథ్యంలో మండలంలోని గామాలపాడు, ఇరికేపల్లి, నడికుడి గ్రామాల్లో పోలీసులు మంగళవారం కవాత్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ సంధ్యారాణి మాట్లాడుతూ..ఎన్నికల సమయంలో ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పటిష్టమైన చర్యలు తీసుకుంటున్నామని, ఎన్నికల నేపథ్యంలో రెచ్చగొట్టేల మాట్లాడటం, దూషించడం చేయవద్దని చెప్పారు. ప్రతి ఒక్కరు ఓటు హక్కు స్వేచ్ఛగా వినియోగించుకోవాలని అన్నారు. ఎస్ఐ దాసరి శివనాగరాజు తదితరులు పాల్గొన్నారు.

గుర్తు తెలియని మృతదేహానికి దహన సంస్కారం

మాచర్ల: పట్టణంలోని పాత మాచర్లలోని శ్రీ వాసవి కన్యక పరమేశ్వరి అమ్మవారి వృద్ధాశ్రమంలో 94 సంవత్సరాల మహిళ అనారోగ్యంతో మరణించిందని స్థానికులు తెలిపిన నేపథ్యంలో స్వామి వివేకానంద చారిటబుల్ ట్రస్ట్, మాచర్ల వారి ఆధ్వర్యంలో కన్వీనర్ మెట్టు గోవిందరెడ్డి విషయం తెలుసుకొని ఓబులశెట్టి నాసరయ్య, గంద్రకోట శివసుందర ప్రసాద్, పమ్మి ప్రభాకర్‌రెడ్డిల సహాయంతో ఆమెకు దహన సంస్కారాలు చేశారు. విషయం తెలుసుకున్న పలువురు సభ్యులను అభినందించారు. ఈ సేవలు గత రెండు నెలల నుంచి చేస్తున్నట్లు పేర్కొన్నారు.

నాగులవరం గ్రామంలో అభివృద్ధి పరుగులు

- అన్ని సేవలు గ్రామంలోనే అందుబాటులోకి
- సుమారు రూ.12.20 కోట్లతో అభివృద్ధి పనులు
- సంక్షేమ పథకాలతో ప్రజలకు రూ.22.33 కోట్ల లబ్ధి
- హర్షం వ్యక్తం చేస్తున్న ప్రజలు



విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్మాణానికి శంకుస్థాపన చేసిన ప్రభుత్వవిప్ పీఆర్కే (ఫైల్)



నాగులవరం గ్రామ సచివాలయం

విజయపురిసౌత్: మాచర్ల మండలం నాగులవరం గ్రామంలో ఏ ప్రాంతానికి వెళ్లినా చూడచక్కని సీసీ రోడ్లు, విద్యుద్దీపాలు, మంచినీటి బోర్లు క్షేత్రస్థాయిలో ప్రజలకు సేవలు అందించేందుకు అన్ని వసతులతో నిర్మించిన సచివాలయం, నాడు–నేడులో పాఠశాల అభివృద్ధితో కళకళలాడుతోంది. సంక్షేమం, అభివృద్ధి ధ్యేయంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి నాయకత్వంలో ప్రభుత్వ విప్, వైఎస్సార్ సీపీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు పిన్నెల్లి రామకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో ప్రతి ఇంటిలోను సంక్షేమ పథకాలతో ప్రజలకు రూ.22.33 కోట్ల లబ్ది జరగగా,



పొలంలోకి వెళ్లేందుకు ఏర్పాటు చేసిన డొంక రోడ్డు

సుమారు రూ.12.20 కోట్లతో అభివృద్ధి పనులు జరిగాయి. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వ విప్ పీఆర్కే దృష్టికి వచ్చిన ప్రజల దీర్ఘకాలిక సమస్యలన్నీ వెంటనే పరిష్కరించి అభివృద్ధి అంటే ఇదేనని చేసి చూపించారు.

- గ్రామంలో ఏళ్ల తరబడి సమస్యలు ఉన్నా గత ప్రభుత్వాలు పట్టించుకున్న దాఖలాలు లేవు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చాక గ్రామంలో అభివృద్ధి ఇలా...
- ప్రతి వీధిలో సీసీ రోడ్డు ఏర్పాటుకు రూ.1 కోటి
- నాగులవరం–చింతలతండా బీటీ రోడ్డు నిర్మాణానికి రూ.2.5 కోట్లు
- సచివాలయం నిర్మాణానికి రూ.45 లక్షలు
- ఎస్సీ కాలనీలో నూతన చర్చి నిర్మాణానికి రూ.25 లక్షలు
- రైతుల పొలాలకు డొంక రోడ్లు వేసేందుకు రూ.20 లక్షలు
- ఎస్సీ, ఎస్టీ కాలనీలలో రూ.10 లక్షలతో నాలుగు మంచినీటి బోర్లు ఏర్పాటు చేశారు.
- నాగులవరం సమీపంలో విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్మాణానికి ప్రభుత్వం రూ.7.5 కోట్లు కేటాయించగా ఇటీవల ప్రభుత్వ విప్ పీఆర్కే శంకుస్థాపన చేశారు.



నాగులవరం–చింతలతండా గ్రామాల మధ్య నిర్మించిన బీటీ రోడ్డు



ఎస్సీ కాలనీలో ఏర్పాటు చేసిన చర్చి

సీఎం రుణం తీర్చుకుంటాం...



ప్రభుత్వం అన్ని విధాలుగా ఉంటుంది. నాకు వైఎస్సార్ ఆసరా వస్తుంది. నా భర్తకు వృద్ధాప్య పింఛన్ వస్తుంది. ప్రభుత్వం నాగులవరంలో ఇంటి స్థలం ఇచ్చింది. ఇప్పుడు ఇంటి స్థలం రిజిస్ట్రేషన్ చేశారు. మా కంటూ స్థిరాస్తిని ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి కల్పించటం ఆనందంగా ఉంది. వచ్చే ఎన్నికలలో వైఎస్సార్‌సీపీకి ఓటు వేసి జగనన్నను ముఖ్యమంత్రి చేసి రుణం తీర్చుకుంటాం.

– చాగంటి అచ్చమ్మ, నాగులవరం గ్రామం

గ్రామంలో రోడ్లు, మంచినీటి బోర్లు వేశారు...



గతంలో ఏ ప్రభుత్వం చేయని అభివృద్ధి ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి చేశారు. గ్రామంలో రోడ్లు, సైడు కాలువలు పొలంలోకి వెళ్లేందుకు డొండ రోడ్లు వేశారు. గ్రామంలో బోర్లు వేసి మంచినీటి సమస్య పరిష్కారం చేశారు. నాకు ప్రభుత్వం డీకే పట్టా మంజూరు చేసింది. ప్రభుత్వం నాకు వితంతు పింఛన్‌తో పాటు ఇంటి స్థలం మంజూరు చేయటం సంతోషంగా ఉంది. వచ్చే ఎన్నికలలో మళ్లీ జగనన్నే ముఖ్యమంత్రి అవ్వటం ఖాయం

– కటికల సైదమ్మ, నాగులవరం గ్రామం

అభివృద్ధి, సంక్షేమ పాలన...



జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం రాష్ట్రంలో సంక్షేమ, అభివృద్ధి పాలన సాగుతోంది. గతంలో గ్రామాల్లో కనీస వసతులు లేక ప్రభుత్వ కార్యాలయాల సిబ్బంది ఎక్కడ ఉంటున్నారో, ఏం పని చేస్తున్నారో తెలిసేది కాదు. ఇప్పుడు సచివాలయ సిబ్బంది ప్రజలందరికి అందుబాటులో ఉండేలా ఊరూరా సేవా కేంద్రాలు ఏర్పాటయ్యాయి. జాతిపిత గాంధీజీ కలలు గన్న గ్రామ స్వరాజ్యం సిద్ధించింది. జగన్ మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో పనిచేయడం సంతోషంగా ఉంది.

– బూడిద మంగమ్మ, ఎంపీపీ, మాచర్ల

వైఎస్సార్‌సీపీలోనే ఆర్యవైశ్యుల అభివృద్ధి

మున్సిపల్ చైర్మన్ కొత్త వెంకట సుబ్బారావు



ప్రజలతో మాట్లాడుతున్న మున్సిపల్ చైర్మన్ కొత్త వెంకట సుబ్బారావు

పిడుగురాళ్ల: ఆర్యవైశ్యుల అభివృద్ధి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలోనే జరిగిందని మున్సిపల్ చైర్మన్ కొత్త వెంకట సుబ్బారావు తెలిపారు. పట్టణంలోని పలు వార్డుల్లో ప్రజలతో కలిసి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వంలో ప్రజలు పొందిన లబ్ధి గురించి పట్టణ ప్రజలకు మంగళవారం వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గురజాల నియోజకవర్గంలో ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి నేతృత్వంలో ఆర్యవైశ్యులకు సముచిత స్థానం కల్పించారని తెలిపారు. పిడుగురాళ్ల మున్సిపల్ చైర్మన్‌గా తనకు అవకాశం కల్పించారని అలాగే మున్సిపల్ కౌన్సిలర్లుగా, మార్కెట్ యార్డు డైరెక్టర్లుగా, గురజాలలో వైస్ చైర్మన్‌గా ఆర్యవైశ్యులకు అవకాశం కల్పించారు. రాజకీయంగా, వ్యాపార పరంగా, అన్ని రంగాల్లో ఆర్యవైశ్యులకు అండగా ఉండి, వారి అభివృద్ధికి పూర్తి స్థాయిలో సహకరించారని తెలిపారు. అలాగే అన్ని వర్గాల ప్రజలకు పార్టీ, కులం, మతం చూడకుండా అర్హతే ప్రామాణికంగా అర్హత ఉన్న ప్రతి ఒక్కరికి పథకాలను అందించడం జరిగిందని తెలిపారు. రాబోయో ఎన్నికల్లో ప్రజలందరు ఫ్యాన్ గుర్తుకే ఓటు వేసి రాష్ట్రంలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని రెండో సారి ముఖ్యమంత్రిగా, గురజాల నియోజకవర్గ ఎమ్మెల్యేగా కాసు మహేష్‌రెడ్డిని, నరసరావుపేట ఎంపీ అభ్యర్థి పోలుబోయిన అనిల్‌కుమార్ యాదవ్‌ను గెలిపించుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందని సూచించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్లు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీలో చేరిన 150 కుటుంబాలు



వైఎస్సార్ సీపీలో చేరిన వారితో ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి

పిడుగురాళ్ల: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలకు ఆకర్షితులై పట్టణంలోని 5వ వార్డుకు చెందిన సుమారు 150 కుటుంబాల వారు టీడీపీని వీడి జక్కుల అప్పారావు యాదవ్, షేక్ జానీ బాషా, తోట లక్ష్మయ్యల ఆధ్వర్యంలో మంగళవారం రాత్రి వైఎస్సార్‌సీపీలో చేరారు. పట్టణంలోని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో గురజాల ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. వీరందరికీ ఎమ్మెల్యే కాసు పార్టీ కండువాలు కప్పి వైఎస్సార్ సీపీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కాసు మాట్లాడుతూ పార్టీని నమ్ముకున్న ప్రతి ఒక్కరికి వైఎస్సార్‌సీపీ అండగా ఉంటుందని ధైర్యం ఇచ్చారు. భవిష్యత్‌లో ప్రతి ఒక్కరికి ప్రభుత్వ పథకాలు అందేలా చర్యలు తీసుకుంటానన్నారు. అలాగే ప్రతి కమ్యూనిటీకి అన్ని విధాలుగా అండగా ఉండి ఆదుకుంటామన్నారు. ముఖ్యమంతి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజలకు అందిస్తున్న సంక్షేమ పథకాలు ప్రతి ఇంటికి చేరాయి. అలాగే రాబోయో రోజుల్లో కూడా ప్రతి ఇంటికి ప్రభుత్వ పథకాలు అందుతాయన్నారు. అందుకే ప్రతి ఒక్కరు రాబోయో ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకే ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ కొమ్ము ముక్కంటి నాయకులు దాదిన బోయిన ఏడుకొండలు యాదవ్, పట్టణ యూత్ కన్వీనర్ మంద సుధీర్, ఎస్సీ కన్వీనర్ కాలే మాణిక్యరావు, నాయకులు గొట్టేముక్కల పవన్‌రెడ్డి, బడిగుంతల వెంకటరమణ, వెంకటేశ్వర్లు, జక్కుల అప్పారావు, షేక్ జానీ బాషా, తోట లక్ష్మయ్య, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సామాజిక న్యాయం వైఎస్సార్‌సీపీలోనే సాధ్యం

మున్సిపల్ వైస్ చైర్మన్ కొమ్ము ముక్కంటి



పార్టీ కార్యాలయంలో విలేకర్ల సమావేశంలో మున్సిపల్ వైస్ చైర్మన్ ముక్కంటి, నాయకులు

పిడుగురాళ్ల: సామాజిక న్యాయం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలోనే సాధ్యమని మున్సిపల్ వైస్ చైర్మన్ కొమ్ము ముక్కంటి అన్నారు. పట్టణంలోని పార్టీ కార్యాలయంలో మంగళవారం విలేకర్ల సమావేశం నిర్వహిచారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టీడీపీ నాయకులు ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలను అన్ని విధాలా ఆదుకున్నామని చెప్పటం హాస్యాస్పదం అన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందింది వైఎస్సార్‌సీపీలోనేనని తెలిపారు. టీడీపీ పుట్టినపట్టి నుంచి ఇప్పటి వరకు ఒక్క బీసీకి గానీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలకు గానీ గురజాల నియోజకవర్గంలో ఒక్కరికైనా రాజకీయాల్లో అవకాశం కల్పించారా అని ప్రశ్నించారు. అదే వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో గురజాల ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి ఆధ్వర్యంలో అన్ని వర్గాలకు అవకాశం కల్పించారన్నారు. మైనార్టీలకు పిడుగురాళ్ల మార్కెట్ యార్డు చైర్మన్‌గా ఎండీ గఫార్, మున్సిపల్ వైస్ చైర్మన్‌గా షేక్ జైలాబ్దిన్, గురజాల మున్సిపల్ ఇన్‌చార్జి చైర్మన్ షేక్ బడే జానీ, మాచవరం ఇన్‌చార్జి ఎంపీపీ షేక్ చింతపల్లి నన్నే, దాచేపల్లి మున్సిపల్ వైస్ చైర్మన్ షేక్ ఖాదర్ బాషా, దాచేపల్లి వైస్ ఎంపీపీ తండా అబ్దుల్ సత్తార్, ఎస్సీలకు నడికుడి మార్కెట్ యార్డు చైర్మన్‌గా కలకండ ఆంధ్రయ్య, దాచేపల్లి ఎంపీపీ కందుల జాను, పిడుగురాళ్ల మున్సిపల్ వైస్ చైర్మన్ కొమ్ము ముక్కంటి, దాచేపల్లి మున్సిపల్ వైస్ చైర్మన్ కొమరబత్తిన విజయకుమార్, పిడుగురాళ్ల మండల వైస్ ఎంపీపీ సాతులూరి బాబు, ఏపీ రాష్ట్ర పౌరసరఫరాల శాఖ కార్పొరేషన్ డైరెక్టర్ కర్రా చిన కోటేశ్వరరావు, గుంటూరు జిల్లా కేంద్ర సహకార బ్యాంక్ డైరెక్టర్ మాచవరం గ్రామానికి చెందిన వెలిశెల అనిల్ కుమార్, బీసీలకు జంగా కృష్ణమూర్తికి ఎమ్మెల్సీ, చంద్రగిరి ఏసురత్నంకు ఎమ్మెల్సీ, దేవళ్ల రేవతికి వడ్డెర కార్పొరేషన్ చైర్మన్, కొమెర వెంకటేశ్వర్లు పిడుగురాళ్ల మార్కెట్ యార్డు చైర్మన్, పిడుగురాళ్ల జెడ్పీటీసీగా జంగా వెంకట కోటయ్య, మాచవరం జెడ్పీటీసీగా జువ్వెనబోచిన శివయాదవ్, గురజాల వైస్ ఎంపీపీగా చల్లా వెంకటేశ్వర్లు, మేర కార్పొరేషన్ డైరెక్టర్ యెనుముల వెంకటేశ్వర్లుకు అవకాశం కల్పించింది వైఎస్సార్‌సీపీ అన్నారు. విషయం తెలుసుకొని టీడీపీ నాయకులు మాట్లాడాలని ఈ సందర్భంగా హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ పిడుగురాళ్ల అధికార ప్రతినిధి దాదినబోయిన ఏడుకొండలు యాదవ్, మున్సిపల్ కౌన్సిలర్లు అజ్మీరా శారద బాయి, కొక్కెర శ్రీను, ముక్కంటి, వెంకటేశ్వర్లు, ఎస్టీ పట్టణ కన్వీనర్ కాంట్రకుంట కన్నయ్య, ఎస్సీ కన్వీనర్ కాలే మాణిక్యరావు, మండల మైనార్టీ కన్వీనర్ షేక్ మోర్జంపాటి ఖాశీం, నాయకులు ఏడుకొండలు పాల్గొన్నారు.

290 మందికి వైద్య పరీక్షలు

రాజుపాలెం: మండలంలోని నెమలిపురి గ్రామ సచివాలయం–2 పరిధిలోని దేవరంపాడులో ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం మంగళవారం జరిగింది. శిబిరంలో డాక్టర్ వెంకటకృష్ణకుమార్‌తో పాటు ముగ్గురు స్పెషలిస్టులు డాక్టర్ లక్ష్మణరావు(పీడియాట్రిషియన్), డాక్టర్ సరస్వతి(జనరల్ మెడిసిన్), డాక్టర్ రామకృష్ణారెడ్డి (కంటి వైద్యులు) పాల్గొని, 290 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. మందులు పంపిణీ చేశారు. కంటి వైద్యులు రామకృష్ణారెడ్డి 49 మందికి కంటి పరీక్షలు చేసి, కళ్లజోళ్లకు రిఫర్ చేశారు. బీపీ, షుగర్ ఉన్న వాళ్లకు 15 రోజులకు సరిపడా మందులు అందించారు. హెల్త్ సూపర్‌వైజర్ జీవన్‌రావు, మిడ్‌లెవల్ హెల్త్ ప్రొవైడర్ తేజస్విని, దేవానాయక్, ఆరోగ్య సిబ్బంది నాగమణి, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

మండలంలో మహిళా ఓటర్లు అధికం

రెంటచింతల: రెంటచింతల మండలంలో పురుషుల కన్నా మహిళా ఓటర్లు 1,522 మంది అధికంగా ఉన్నారు. 2024 జనవరి లెక్కల ప్రకారం మండలంలోని 11 గ్రామాలకు సంబంధించి 50 పోలింగ్ కేంద్రాల పరిధిలో పురుషులు 19,261 మంది, మహిళలు 20,783 మంది, ఇతరులు ఇద్దరు మొత్తం 40,046 మంది ఓటర్లు ఉన్నారు. గ్రామాల వారీగా రెంటచింతలలో 12,772, పాలువాయి 3,658, పాలువాయిగేటు 1,448, తుమ్మకోట 4,220, కొత్తగంగరాజుపల్లి 311, పశర్లపాడు 2,430, మల్లవరం 1,673, జెట్టిపాలెం 3,223, గోలి 1,373, మిట్టగుడిపాడు 1,562, రెంటాల 4,019, మంచికల్లులో 3,357 మంది ఓటర్లు ఉన్నారు. రాష్ట్రంలో మే 13న జరగనున్న సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఏప్రిల్ 15వ తేదీలోగా 18 ఏళ్ల వయస్సు నిండిన వారికి కొత్తగా ఓటు నమోదుకు మరోసారి అవకాశం కల్పిస్తూ ఎన్నికల కమిషన్ ఉత్తర్వులు జారీ చేయడంతో మండలంలో ఓటర్ల సంఖ్య పెరిగే అవకాశం ఉంది. 197 నుంచి 246 పోలింగ్ బూత్ నెంబరు వరుకు రెంటచింతల మండలానికి చెందిన పోలింగ్ కేంద్రాలుగా ఏర్పాటు చేశారు.

పార్టీకి పూర్తి స్థాయి మద్దతిస్తాం



పీవీఆర్‌ని శాలువాతో సత్కరిస్తున్న వివిధ సంఘాల నాయకులు

మాచర్ల: రాష్ట్రంలో దళిత వర్గాల కోసం కృషి చేస్తున్న సీఎం జగన్‌మోహన్‌రెడ్డితో పాటు నియోజకవర్గంలో ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డిలు ఎస్సీ, ఎస్టీ, బీసీలకు చేసిన మేలుకు మెచ్చి మద్దతు పలికి ఐదవ సారి పీఆర్కేను గెలిపిస్తామని పలు సంఘాల నాయకులు తెలిపారు. 30, 31వ వార్డులకు చెందిన బహుజన పోరాట సమితి నాయకులు వైఎస్సార్‌సీపీ రాష్ట్ర యువజన ఉపాధ్యక్షుడు పిన్నెల్లి వెంకట్రామిరెడ్డిని ఆయన కార్యాలయంలో కలిసి పార్టీకి మద్దతు తెలుపుతామని చెప్పారు. అనంతరం పీవీఆర్‌ని సత్కరించారు. ఈ కార్యక్రమంలో దళిత సంఘ నాయకులు కందుకూరి రత్నరాజు, యలకపాటి బుచ్చయ్య, కిషోర్, కోటా బాబు, బీర్నిడి రోశయ్య, మాచర్ల రాజులు, కందుకూరి మధుతో కలిసి పివిఆర్‌ను మర్యాదపూర్వకంగా కలిసి మద్దతు తెలిపారు.

మాజీ సర్పంచ్ నాసరయ్య మృతి బాధాకరం



మాజీ సర్పంచ్ నాసరయ్య మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న ప్రభుత్వ విప్ పీఆర్కే

వెల్దుర్తి: మండలంలోని పట్లవీడు పంచాయతీ మాజీ సర్పంచ్ బాలబోయిన నాసరయ్య (70) మృతి చెందటం బాధాకరమని పల్నాడు జిల్లా వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి మంగళవారం అన్నారు. పీఆర్కే మాట్లాడుతూ నాసరయ్య కుటుంబం వైఎస్సార్‌సీపీ ఆవిర్భావం నుంచి చురుకుగా పనిచేస్తూ పార్టీ తరఫున సర్పంచ్ బాధ్యతలు నిర్వహించారన్నారు. మొదటి నుంచి తమ కుటుంబానికి, వైఎస్సార్‌సీపీకి వెన్నుదన్నుగా ఉండేవారన్నారు. అనారోగ్యంతో నాసరయ్య మృతి చెందటం బాధాకరమన్నారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి సంతాపం వ్యక్తం చేశారు. ఆయన వెంట మండల పరిషత్ ఉపాధ్యక్షుడు రాయంకుల గోపాల్, కండ్లకుంట సొసైటీ అధ్యక్షుడు తాడికొండ పుల్లారెడ్డి, గ్రామ సర్పంచ్ చల్లా శ్రీను, మాజీ సర్పంచ్ కోనుగుంట శ్రీనివాసరెడ్డి, చౌడయ్య, గుండెబోయిన నాగేశ్వరరావు, మాజీ కౌన్సిలర్ తాళ్ళ కొండలు, వైఎస్సార్‌సీపీ నాయకుడు బొడ్డు నరసింహారావు తదితరులున్నారు.

వైఎస్సార్ సీపీలో చేరిన టీడీపీ నాయకులు



పీవీఆర్ సమక్షంలో వైఎస్సార్ సీపీలో చేరిన 25వ వార్డు నాయకులు

మాచర్ల: రాష్ట్రంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల కోసం సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్లుగా సీఎం జగన్‌మోహన్ రెడ్డి సుపరిపాలన అందించారని, అందుకే ఆయన పాలన మెచ్చిన పలువురు టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలోకి చేరుతున్నారని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర యువజన ఉపాధ్యక్షుడు పిన్నెల్లి వెంకట్రామిరెడ్డి అన్నారు. మంగళవారం పట్టణంలోని 25వ వార్డుకు చెందిన 15 కుటుంబాల టీడీపీ నాయకులు, కార్యకర్తలు ఆ పార్టీని వీడి పీవీఆర్ సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. పార్టీ కార్యాలయంలో మంగళవారం జరిగిన ఈ కార్యక్రమంలో వార్డుకు చెందిన దొడ్డా వెంకటేష్, దొడ్డా నాగేశ్వరరావు, దొడ్డా కృష్ణ, మామిళ్ళపల్లి శివనాగరాజు, దొడ్డా విజయలక్ష్మి, బాలయ్యలతో పాటు మరో 10 కుటుంబాల వారు జగన్‌కు జై జేలు పలుకుతూ వైఎస్సార్‌సీపీలో చేరారు. ఈ సందర్భంగా వీరందరికీ పార్టీ కండువాలు కప్పి ప్రతి ఒక్కరినీ పేరు పేరున పలకరించి సాదరంగా ఆహ్వానించారు. పార్టీలో చేరిన ప్రతి ఒక్కరికీ సముచిత స్థానముంటుందని పీవీఆర్ పేర్కొన్నారు. రాబోయే రోజుల్లో ప్రతి ఒక్కరూ జగన్‌ను సీఎం చేసేందుకు 50 రోజులు కష్టపడాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్ బోయ రఘురామిరెడ్డి, పట్టణ పార్టీ అధ్యక్షులు పోలా శ్రీను, అంకిరెడ్డి, నరసింహారావు, పలువురు నాయకులు పాల్గొన్నారు.

అత్యంత సమస్యాత్మక గ్రామాలపై ప్రత్యేక దృష్టి



ఎస్ఐ వెంకట నారాయణరెడ్డి

రెంటచింతల: 2024 మే 13న నిర్వహించనున్న సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో మండలంలోని అత్యంత సమస్యాత్మక గ్రామాలపై ప్రత్యేక దృష్టి పెట్టినట్లు ఎస్ఐ కె.వెంకట నారాయణరెడ్డి అన్నారు. మంగళవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత ఎన్నికల సమయంలో జరిగిన ఘటనలను దృష్టిలో పెట్టుకుని మండలంలోని పలు గ్రామాలను అత్యంత సమస్యాత్మక గ్రామాలుగా గుర్తించి ఉన్నతాధికారుల సూచనల మేరకు ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశామన్నారు. గ్రామాలలో ఓటర్లు స్వేచ్ఛగా వారి ఓటు హక్కు వినియోగించుకునే విధంగా ప్రశాంత వాతావరణాన్ని కల్పించడమే లక్ష్యంగా కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. చట్టం దృష్టిలో అందరూ సమానమేనని ఎవరైనా పోలింగ్ బూత్‌ల వద్ద ఓటర్లను ఇబ్బంది పెట్టినా, భయ భ్రాంతులకు గురి చేసినా అటువంటి వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఎవరి ఓటు వారు నిర్భయంగా వేయాలని, మద్యానికి, డబ్బుకు అమ్ముడు పోయి ఎంతో విలువైన ఓటును దుర్వినియోగం చేయవద్దన్నారు. ఇప్పటి వరకు పలు గ్రామాలకు సంబంధించి 85 మంది రౌడీషీటర్లతో సహా అనేక మందిపై బైండోవర్ కేసులు నమోదు చేశామన్నారు. ప్రతి పోలింగ్ కేంద్రం వద్ద కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటామన్నారు. కోడ్ అమల్లో ఉన్న నేపథ్యంలో రాజకీయ పార్టీలకు చెందిన ఫ్లెక్సలు గ్రామాల్లో ఏర్పాటు చేయడం చట్టాన్ని ఉల్లంఘించడమేనన్నారు. ప్రశాంతంగా ఎన్నికల నిర్వహణకు ప్రజలు, వివిధ రాజకీయ పార్టీ నాయకులు పూర్తిగా సహకరించాలని కోరారు.

విధుల నుంచి వలంటీర్ తొలగింపు

సత్తెనపల్లి: మండల పరిధిలోని గండ్లూరు గ్రామానికి చెందిన వలంటీర్ ఆదం షఫీని విధుల నుంచి తొలగిస్తూ ఎంపీడీవో ఎస్.జగదీష్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. వలంటీర్ ఆదం షఫీ తన వాట్సాప్ స్టేటస్‌లో వైఎస్సార్ సీపీ జెండాతో, టోపీ ధరించిన ఫొటో పెట్టుకోవడంతో ఎన్నికల సంఘం నిబంధనల మేరకు ఆయనను తొలగిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. దీనిపై జిల్లా కలెక్టర్ ఎల్.శివశంకర్ సత్తెనపల్లి ఆర్వో వి.మురళీకృష్ణ నివేదిక పంపారు.

చికిత్స పొందుతూ కార్పెంటర్ మృతి

సత్తెనపల్లి: పట్టణంలోని 26వ వార్డుకు చెందిన కార్పెంటర్ మాబు కరీం(43) చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు. వివరాల మేరకు.. ఈ నెల 18న ద్విచక్ర వాహనం పై అచ్చంపేట రోడ్‌లో వెళ్తుండగా అతనిని లారీ ఢీ కొట్టింది. ఈ ఘటనలో మాబు కరీంకు కాలు విరిగి గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం నరసరావుపేట వైద్య శాలకు తరలించగా మంగళవారం మృతి చెందాడు. మృతుడికి భార్య సైదాబీ, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. మృతదేహాన్ని పోస్ట్‌మార్టం నిమిత్తం సత్తెనపల్లి ఏరియా వైద్యశాలకు తరలించి, పట్టణ పోలీసులు కేసు నమోదు చేశారు.